# కాటు

తెనాలి సుశీలాదేవి



వేళ్ళు చురుక్కుమన్నాయి.

అప్రయత్నంగా విదిలించి కొట్టాడు సిగరెట్‌ని రాఘవ.

యిసుకలో పడి చప్పచల్లారిపోయింది.

కొన్ని క్షణాల క్రితం తన నరనరాల్లో వుత్తేజాన్ని రేకెత్తించి.... క్షణం క్రితం తనమీద కసి తీర్చుకుంటున్నట్టుగా చురుక్కుమని కాల్చి .... యిప్పుడు .... యీ క్షణాన అస్థిత్వాన్ని కోల్పోయి.... యిసుకలో కూరుకుపోయి.... తల విదిలించాడు.

యిదేమిటి....? సిగరెట్ మీంచి దృష్టి మరల్చాడు. జాలిగా వుందతనికి సిగరెట్ మీద కాదు. తనమీదే

కోపంగా....కచ్చగా వుంది. తనమీద

మాత్రం కాదు. వాటికి కారకుడయిన వ్యక్తిని గొంతుపిసికి చంపాలనుంది. పెట్రోలు పోసి తగలెట్టాలని వుంది.... యింకా... యింకా... కత్తికొక కండగా కొకులకు....'

ఊహూ....యివేవీ చేయలేడు.

అందుకే తనమీద తనకే జాలిగా వుంది.

నిస్సహాయంగా ఎదురుగా వున్న సముద్రంకేసి చూశాడు.

ఘోషిస్తోంది తన హృదయంలాగే.

వువ్వెత్తున లేచిపడుతున్న కడలి తరంగాలు.... కల్లోలతరంగాలుగా తనను ముంచేయటానికి వస్తున్న మృత్యు తరంగాలుగా....

'ఎంత ఆశ్చర్యం? మనసు స్పందిస్తున్న భావాల కనుగుణంగా ప్రకృతి గోచరించటం....

వారంరోజుల క్రితం యిదే ఒడ్డున... యిదే సముద్రం.... తన మనస్సులోని సంతోషానికి, సంబరానికి తనూ స్పందించినట్టుగా ఆనంద తరంగాలుగా.... ఉత్సాహపు కెరటాలు తనను ఉత్తేజపరచి.... యిప్పుడు ఈ క్షణాన ఎంత మార్పు....

యీ మార్పు...ఎక్కడ...ఎక్కడ.. ఎక్కడ?

అంతు అగపడని ఎదురుగా వున్న ఆ సముద్రంలోనా....? తన మనస్సాగరం లోనా.... లేక.... తన జీవన కడలిలోనే .... యిసుకలో దూర్చిన రాఘవ వేళ్లు పిడికిళ్ళు బిగించాయి.

'స్కౌండ్రల్'... బిగించిన పళ్ళమధ్య గొణిగాడు.

లేచి బట్టలు దులుపుకుని వెనక్కి తిరిగాడు.

అతడితో పాటే వచ్చిన ఆలోచనలూ అతడితోటే వెనక్కి తిరిగి.... వెన్నంటుతూ....

* * *

రాఘవ భయంభయంగా మేనేజరు గదిలోకి వెళ్ళాడు.

ఆ సీటు, ఆ ఠీవి, దర్పం చూస్తేనే కాళ్ళు వణుకుతున్నాయి రాఘవకు.

చేతులు జోడించి టేబిలు ముందు నిలబడ్డాడు.

'ఎలా వుంది వుద్యోగం మిస్టర్ రాఘవా....'

ముందరున్న ఫైలు కాగితాల్లో సంతకాలు చేస్తూ అడిగాడు మేనేజరు.

"బా....బావుంది సార్.. ఎ...ఏదో. , మీ దయవలన... "

తొట్రుపాటు నణుచుకోటానికి వ్యర్థ ప్రయత్నం చేస్తున్నాడు రాఘవ

"దయ దేముందిలే .... కృతజ్ఞత వుండాలిగానీ...." సూటిగా రాఘవ కళ్ళలోకి చూస్తూ అన్నాడు.

"మీ రుణం తీర్చుకోలేను సర్.... ఉత్తరం, దక్షిణం లేందే పని జరగని,

పని దొరకని యీ గడ్డురోజుల్లో.... మీరు .... మీరు.... నా ....నాకు.... భిక్ష పెట్టారు సర్...."

"అయితే కృతజ్ఞుడినంటావు...."

"మాటలు చెప్పలేను సర్...."

అంత గొప్ప ఆఫీసరు ఎంత ఆదరంగా, ఎంత అభిమానంగా మాట్లాడుతున్నాడో యీ చిరుద్యోగికో.

వినయంతో మరింత వంగిపోయాడు రాఘవ.

"ఊ, ఫ్యామిలీ తెచ్చేసుకున్నావా? మీరు న్యూలీ వెడ్డెడ్ అనుకుంటాను...."

"అదేంకాదు సార్. సంవత్సరమైంది ....కాని....వుద్యోగంలేక....తను పుట్టింట్లోనే వుంది. మీ దయవల్ల యిన్నాళ్ళకి ....కొత్త దంపతులం కాదుగానీ....కొత్త కాపురం...."

"ఐసీ....నీ భార్య నీలాగే అందంగా వుంటుందా....?"

ఆ చనువుకి, ఆప్యాయతకీ మురిసిపోయాడు రాఘవ.

సిగ్గుపడుతూ అన్నాడు.

"తను చాలా అందంగా వుంటుంది సర్...."

రాఘవ కళ్ళలో అందమైన 'సీత' మెరిసి, కవ్వించింది.

"ఆ....బైదబై...మిస్టర్ రాఘవా.... నువ్వన్నట్టు యీ గడ్డురోజుల్లో వుద్యోగం అంటే మాటలుకాదు. ఉత్తరం, దక్షిణం లేకుండా....యిప్పటికిప్పుడు పనిలోంచి తీసేశాననుకో...."

"సా....ర్...." ఆందోళనగా, అయోమయంగా అన్నాడు రాఘవ.

"ఎందుకోయ్ అలా బెదిరిపోతావ్, అన్నేదో యిప్పుడే తీసేస్తున్నట్టు. వుద్యోగం దొరకటం ఎంత దుర్లభమో దాన్ని నిలబెట్టుకోవటం కష్టమే అవుతుంది అని ఏదో మాటల్లో చెబుతూ....అన్నట్టు. ఉత్తరం, దక్షిణలుగాక ఏదో వుందోయ్ ....నీ ఋణం తీర్చుకోవాలనుకుంటే.... నీవు కృతజ్ఞత తెలపాలనుకుంటే...." ఆగాడాయన.

"సా....ర్...." చెవులప్పగించాడు రాఘవ.

"ఉత్తరం, దక్షిణలు నీ దగ్గర ఎలాగూ లేవు.

"నీ వుద్యోగం పూడకుండా వుండాలంటే....అసలు ఎందుకిచ్చాననుకున్నావు ....ఆ మాటొది...." చెప్పటం పూర్తి చేసి కుషన్‌చేర్‌లో వెనక్కువాలి అలవోకగా సిగరెట్ పొగని వదులుతూన్న మేనేజరు కేసి భయంగా .... పిచ్చిగా....కోపంగా....రాఘవ ఒంట్లోని రక్తం నీరుగా మారి....పాదాలలోకి జారిపోయి....ఆఫీసులోంచి ఎట్లా బయటపడ్డాడో తనకే తెలీదు.

వస్తూ....వస్తూ మిగతా సీట్లలోని వాళ్ళవంక చూశాడు.

ఎవరి పని వాళ్ళు చూసుకుంటున్నారు.

వీళ్ళందరూ యిట్లా వుద్యోగం చేసుకోగలుగుతున్నారంటే వీళ్ళందరి భార్యలూ....

'ఛీ....ఛీ....కాదు...కాదు... ఉత్తర దక్షిణలు తెలేనివాళ్లు మాత్రం'

అలాంటి వాళ్ళంతా కలిసి ఎదురు తిరిగితే....

'అందరి వరకు ఎందుకు? నీ వేం చేశావు? తల వంచుకుని రాలేదూ.... ఎదురు తిరగలేదెందుకని....కనీసం ఛీ కొట్టలేదేం....'

అంతరాత్మ ప్రశ్నించింది.

జవాబు తెలుస్తూనే వుంది.

అది గవర్నమెంటాఫీసు కాదు. ప్రయివేటు కంపెనీ!

గేటుదాటి యివతలికి వచ్చి వెనక్కి తిరిగి ఒక్కసారి చూశాడు.

నల్లటి బోర్డు.... తెల్లటి అక్షరాలు.

"శీలా అండ్ శీలా....కంపెనీ."

'థూ ..' ఒక్కసారి వుమ్మేసి చర చరా బయలుదేరాడు.

* * *

ఉత్తుంగ తరంగాల ఒడ్డున కల్లోలిత హృదయంతో రాఘవ వుద్యోగంలో చేరగానే ఎంత తహతహలాడిపోయాడు 'సీత'ను తెచ్చుకోవాలని.

పెళ్ళయి సంవత్సరమైంది.

అటు అత్తవారింట్లోనూ, యిటు పుట్టింట్లోనూ యిమడలేని 'సీత' నిరుద్యోగి పెళ్ళాంగా యీసడింపులు భరిస్తూ....

'తన దూర కంత లేదు, మెడకో డోలని ... పెళ్ళో పెళ్ళో అని కొడుక్కి పెళ్ళి చేశావు. నా నెత్తిమీద పరో తద్దినం తెచ్చిపెట్టావు. వీళ్ళందరిని ఎట్లా పేగిస్తా ననుకున్నావు... '

తండ్రి తల్లితో చిర్రుబుర్రు లాడటం తన చెవులదాకావచ్చి సీతను పెనవేసుకున్న చేతులు ఎన్నిసార్లు సడలిపోలేదు .. ?

'గుడ్ల నీళ్లు కుక్కుకునే సీతను ఓదార్చటానికి కూడా చేతకానివాడై ....

'సీత' అడది. ఏడవగలిగింది.

నిట్టూర్పుల మధ్య తన బాధావ్యథిత హృదయాన్ని తొక్కిపెట్టుకుని తను ఎన్ని నిద్రలేని రాత్రులు గడపలేదు.

సీత పుట్టింట్లో వుండగా వెళ్ళాలంటే మరింత ప్రాణం చచ్చేది.

'పైసా తికాణా లేదుగానీ యీ ముద్దుముచ్చట్లకేం తక్కువేం లేదు .. '

యీ మాట రకరకాలుగా ఆ యింట్లో ఎవరో ఒకరి నోటివెంబడి వచ్చేది తన మనసును ముక్కలుచేసి....కాల్చి....

ఏదో ఒక ఉద్యోగం సంపాదించుకో

గలిగితే గానీ రాకూడదని నిశ్చయించుకుని పట్టుదలమీద వచ్చాడు.

మనసు విప్పి తన బాధలన్నీ చెప్పుకోగా జాలి తలచిన ఒక పెద్దమనిషి చూపించిన వుద్యోగం యిది.

విహంగంలా ఎగిరింది మనసు మయూరంలా నాట్యంచేసింది హృదయం. ఆనందం రెక్కలు చాస్తుంటే... కోరికలు పురివిప్పుకుంటుంటే ... అఘమేఘాలమీద వెళ్ళి సీతను తెచ్చుకున్నాడు

కొత్త పెళ్ళికూతురిలా సీత, శోభనం పెళ్ళికొడుకులా తనూ....ఓహ్ యీ అదృష్టం యిలా వస్తుందని తను ఆశ కూడా వదిలేసుకుని నిస్సారంగా గడుపుకొస్తూంటే...

మరుభూమి మీద అమృతపు ఝల్లులాగ... యీ వుద్యోగం. జీవితం పూలతోట అయిందని సంబరపడినన్నాళ్ళు పట్టలేదు. యిదేమిటి....పూలతోటలో ఝంఝామారుతం .. మగవాడన్నవాడు, మొగుడన్నవాడు భరించగలిగేదేనా . యింత అన్యాయమా ...

ఆక్రోశం బుసలు కొట్టింది సెగలు చిమ్మింది...ఏంలాభం క్షణికం. వాస్తవం ఆ సెగల్ని నీరు కార్చింది

యీ వుద్యోగం పోతే మళ్ళీ సీత.

తన కాపురం గత కలలు.

నిరుద్యోగిగా ఛీత్కారాలు

గుండెలో సన్నని మంటలాటి ఆవేదన నునుసిగ్గులు, ఓరచూపులు, వయ్యారాలతో తన సందిటచేరే సీతను . ఆ రాస్కెల్ ..

ఒరే నీచుడా .... నీకేం పోయ్యే కాలం వచ్చిందిరా యిట్లా ఎందరి వుసురు పోసుకుని బ్రతుకుతున్నావురా... నిన్ను కాదు అనవలసింది నీలాంటి కుక్కలకు ఆ కనకపు సింహాసనం అమర్చాడే ఆ దేవుణ్ని.

పిచ్చివాడిలా జుట్టు పీక్కున్నాడు, రాఘవ.

నిస్సహాయుడిలా ఆక్రోశించాడు.

వెర్రివాడిలా శూన్యంలోకి చూస్తుండిపోయాడు.

అంతరంగ మథనంతో అలసిపోయాడు.

కాలి చురుక్కుమనిపించిన సిగరెట్‌ని కసిగా యిసకలోకి విసిరి....నెమ్మదిగా యిల్లు చేరుకున్నాడు రాఘవ.

స్నానం చేసి, తెల్లచీర కట్టుకుని, మల్లెపూలు తురుముకుని ఒళ్ళంతా కళ్ళుగా రాఘవకోసం ఎదురుచూస్తున్న సీత అతడి వాలకం చూసి బెదిరిపోయింది. భయపడింది

గుచ్చి గుచ్చి అడిగినా గుండెల్లో దాచుకుని మౌనంగా రోదించటం మినహా మరేం చెప్పలేకపోయాడు రాఘవ.

ఆ రోదనలోనే ఆవేదనలోనే అతడో నిర్ణయం తీసుకున్నాడు.

* * *

"యీాయనే మా మేనేజర్.. సార్! యీావిడ. .సీత .. నా భార్య ."

"బ్యూటిఫుల్...." అబిగా హూతా డాయన. "సతిమాట జవదాట" సీత" ఓరగా, గమనింపుగా రాఘవకేసి ఓ క్షణం చూశాడు.

మెబ్బు కమ్మిన ఆకాశంలా వుంది రాఘవ ముఖం.

బెరుకుగా, పిరికిగా చూస్తున్న సీత లేడిలా వుంది

ఆ గెస్టుహౌస్ చుట్టూ .... వున్న క్రోటన్ మొక్కలని, పూలనీ చూస్తోంది.

రెపరెప లాడుతున్న పూలతీగెలాగే కన్పించింది సీత అయనకి. ఆ తీగ్గె తన గుండెలో గుచ్చుకుంటే ... ఆ తీగ తనని చుట్టేస్తే....

ఓహ్...

"యిక ఆలశ్యం భరించలేనివాడిలా లేచి నిలబడ్డాడు ఆయన. 'వెల్‌డన్ మిస్టర్ రాఘవా.... థ్యాంక్‌యూ వెరీమచ్ .. నీకు దొరికిన అదృష్టాన్ని నాకూ పంచుతున్నందుకు... యిక నీ వుద్యోగానికేం ఢోకా లేదు....యింతకూ ..మీ సీతకు చెప్పావా విషయమిదని..." మౌనంగా తల వూపాడు రాఘవ.

మేనేజరు తొందర గమనించి వెళ్ళటానికి సిద్ధపడ్డాడు. అతని దగ్గర సెలవు తీసుకున్నాడు. మనసులో చలనం లోపించినట్లుగా వున్నాడతాడు.

"ఉదయమే వచ్చి నీ భార్యను తీసికెళ్తా."

తల వూపాడు రాఘవ.

బొమ్మలా వరండా మెట్లు దిగాడు

సీత పరుగునవచ్చి ప్రక్కన నిలబడింది...

మేనేజరు ఆసక్తిగా చూస్తున్నాడు.

రాఘవను చూస్తుంటే ఏ మూలో జాలిగా వుంది

'పూర్ ఫెలో' అనుకున్నాడు.

ఆ అమ్మాయిని చూస్తుంటే కాంక్ష పెరిగిపోతోంది.

'ఐ యామ్ ఎ లక్కీ ఫెలో' భుజాలు ఎగరేశాడు.

రాఘవ భార్య భుజంమీద చెయ్యేసి దగ్గరకు తీసుకుని నచ్చచెబుతున్నట్టుగా ఏదో అనటం, ఆ అమ్మాయి భయంగా... పిరికిగా తమాషాగా కనబడుతోందా దృశ్యం అయనకు

కొన్ని క్షణాల తర్వాత రాఘవ తల వంచుకుని చరచరా వెళ్ళిపోయాడు.

కొండచిలువలా సీతను సమీపించాడాయన

గిజగిజలాడుతూ ఆ కోరల మధ్య

యిరుక్కుపోయింది 'సీత'.

* * *

ఆ రోజు వచ్చిన పర్సనల్ లెటర్స్ చూస్తున్నాడు మేనేజరు.

గతరాత్రి అనుభవం తాలూకు నిషా తెరలు యింకా తొలగిపోలేదు అతడి మీద.

హుషారుగా....ఉత్సాహంగా.... గర్వంగా....తన అదృష్టానికి తనే అభినందించుకుంటూ....

కవరు ఓపెన్ చేసి బయటకు తీసిన ఓ ఉత్తరం....

అతడి కళ్ళు విచ్చుకున్నాయి. వ్రేళ్ళు బిగంగా కాగితాల్ని నొక్కిపట్టుకున్నాయి ....ఆ అక్షరాల వెంబడి చూపులు.... బెదురుగా, భయంగా, ఆందోళనగా.

'సింహాసనం మీద కూర్చున్న ఓ కుక్కా!

నిన్ను నీ సుందర భార్య తప్పించుకుని తల వంచుకుని తిరిగివెళ్ళిపోయిన రాఘవ యీ ఉత్తరం వ్రాశాడనుకునే సరికి సీత గుండెలు పట్టేసుకుంది.

అధికారం చేతిలో వుంది కదా అని అమాయకుల మాన ప్రాణాలతో చెలగాటా లాడే నీచుడివి నీవు.

అష్టకష్టాలు పడి ఎవరెవరి కాళ్ళో పట్టుకుని యీ వుద్యోగం సంపాదించుకున్నాను....ఆ భరోసాతో సంవత్సర వియోగం తర్వాత అపురూపంగా భార్యను తెచ్చుకుని కాపురం పెట్టాను. మా కలల కాపురాన్ని కాటేసి విషపూరితం చేయాలని చూస్తావా....?

చాలామంది ఆడవాళ్ళు పరాయి మగవాడిని సోదరుడిగా చూస్తారు. కొందరు స్నేహితుడిగా అభిమానిస్తారు పరాయి పురుషుడు తనను సోదరిగా గుర్తించాలని తాపత్రయపడతారు.

ఏ కొద్దిమందో కనబడిన ప్రతి మగవాడూ తన అందానికి దాసోహంచేసి తమ కొంగు పట్టుకోవాలనుకుంటారు. వీళ్ళకెలాంటి నీతి నియమాలూ, అభ్యంతరాలూ వుండవు. శరీరం అనుభవాలు కావాలి, అంతే. అట్లాంటి వాళ్ళుంటారు చూడు. ఆ ఆడవాళ్ళని వేటాడుకో. సంతోషంగా నిన్ను అనుభవించి తామూ మురిసిపోతారు. అంతేగాని....

మా యిండ్లల్లో ఎంత చిచ్చు రేగుతుందో...మా కళ్ళు ఎన్ని కన్నీళ్ళు కారుస్తాయో నువ్వు ఊహించగలవా....

మా కాపురాన్ని నిస్సహాయతని అవకాశంగా తీసుకుని మా జీవితాలని కాటేయాలని చూసే నీవు భ్రష్టగతుడవు.

యిలా ఎందరిని నీ పొట్టన పెట్టుకున్నావు....?

యింకా ఎంతమందిని....

అందుకే .... అందుకే .... నీలోని

విషానికి విరుగుడు కాటు....

రాత్రి నాతో వచ్చిన సీత, నీతో కలిసి నిన్ను మురిపించిన సీత నా భార్య 'సీత' కాదు. మరి యీ సీత ఎవరో తెలుసా?

తన డబ్బు అవసరం నేను తీరుస్తానంటే, నా అవసరం తీర్చటానికి నాతో కలిసి వచ్చింది నా సూచన మేరకు నా భార్యగా నీకు పరిచయమై నీతో కులికింది.

పరాయివాడి పెళ్ళాన్ని వాడి అంగీకారంతోనే చెరబట్టగలిగానని మురిసిపోయావే... నీ మురిపెం తీర్చిన ఆ సీత....నేను నా డాక్టరు ఫ్రెండ్ సాయంతో సెలక్టుచేసి నీకోసం తీసుకొచ్చిన బజారు ఆడది. రోగాల పుట్ట. మందులకు లొంగే రోగం కాదు.

ఆ ఆడదాన్ని నీకు తగిలించి తద్వారా నీకా రోగాలు తగిలించి నా కసి తీర్చుకుంటున్నాను

ఆ రోగాలతో నీవు కుళ్ళిపోవాలి

వాటిని వదిలించుకునే ప్రయత్నం లోనే నీవు కృశించిపోతావు

అప్పటికి నీ యౌవనం కరిగిపోతుంది

నీ పొగరు దిగిపోతుంది.

జీవచ్ఛవమై పోతావు.

నా భార్యను నీకు అప్పగించి నిలుపుకోవలసిన యీ ఉద్యోగం నా కక్కర లేదు. మనసులని చంపుకుని మనుగడ సాగించడం నికృష్టం. యీ ప్రపంచంలో మరో విధంగా బ్రతకలేకపోతే యిద్దరం యింత విషం మింగి చస్తాం.. అంతే గానీ. .

యీ రోజునుండీ నికృష్టపు బ్రతుకుతో క్షణ క్షణం చస్తావు నీవు యీ రోజునుండి ప్రతి క్షణం నిజాయితీగా బ్రతకటానికి పోరాటం సాగిస్తాం మేము.

నీ జీవితం ఆవిరి కావటానికి మొదలయిన యీ ఘడియనుండయినా నీవు చేసిన పాపాలకు పశ్చాత్తాప పడు.... బై ..

వ్రేళ్ల పట్టుతప్పి జారిపోతున్న కాగితాల వంక పిచ్చిగా చూశాడాయన. ఆ అక్షరాలన్నీ భయంకరంగా మారి ... కాలనాగుల్లా కాటువేయటానికి నాలుకలు చాస్తూ

ముచ్చెమటలతో కుర్చీలోకి ఒరిగిపోయాడాయన.